సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 30 । అక్టోబర్‌ । 2023

శ్రీవారికి చక్రస్నానం

సిరిసిల్లటౌన్‌: పది రోజులుగా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించుకుంటున్న సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి వేదపండితులు ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. ఆదివారం సాయంత్రం మానేరునదికి తీసుకెళ్లి స్వామివారికి చక్రస్నానం చేయించి, ప్రత్యేకంగా అలంకరించారు.



న్యూస్‌రీల్‌

కేటీఆర్‌కు రూ.10వేలు అందించిన విద్యార్థులు



మంత్రి కేటీఆర్‌కు రూ.10,116 అందిస్తున్న విద్యార్థి నాయకులు

సిరిసిల్లటౌన్‌: మంత్రి కేటీఆర్‌కు ఎన్నికల నామినేషన్‌ కోసం బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు షేక్‌ సికింధర్‌ ఆధ్వర్యంలో రూ.10,116 అందించారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సిరిసిల్లను ఎడ్యుకేషనల్‌ హబ్‌గా తీర్చిదిద్దిన మంత్రి కేటీఆర్‌ మళ్లీ గెలవాలన్న కాంక్షతో సిరిసిల్లలోని వికాస్‌ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు విరాళం పోగుచేసినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్వీ నాయకులు సయ్యద్‌ అఫ్రోజ్‌, కొమ్మురాజుల చందు, వరి శ్రీనివాస్‌, కాసర్ల పవన్‌, మహేశుని శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

‘విద్యార్థులను స్వార్థానికి వాడుకుంటున్నాయి’



మాట్లాడుతున్న దరువు ఎల్లన్న

సిరిసిల్లఅర్బన్‌: బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీలు విద్యార్థి నాయకులను స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని తెలంగాణ ఉద్యమకారుడు దరువు ఎల్లన్న ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి రెండేళ్లుగా కష్టపడితే తీరా ఎన్నికల సమయంలో తనకు అన్యాయం చేశారన్నారు. ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 119 నియోజవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు విద్యార్థి సంఘం నాయకుడికి ఒక్కరికి టికెట్‌ ఇవ్వలేదన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు.

నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాలు





డాక్టర్‌ వి.త్రివేణి, డాక్టర్‌ ఎం.దేవేంద్ర, గోపగాని రవీందర్‌

సిరిసిల్లకల్చరల్‌: ప్రముఖ అనువాదకుడు, సాహిత్యకారుడు జిల్లాకు చెందిన నిజాం వెంకటేశం స్మారకార్థం సాహిత్య పురస్కారాలు అందించేందుకు నిర్ణయించినట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు బీఎస్‌ రాములు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 50 పుస్తకాల్లోంచి నలుగురిని న్యాయనిర్ణేతల బృందం ఎంపిక చేసిందని తెలిపారు. డాక్టర్‌ వి.త్రివేణి వెలువరించిన ‘భరిణ’(స్త్రీల రచనలపై సాహిత్య వ్యాసాలు), డాక్టర్‌ ఎం.దేవేంద్ర రాసిన ‘తెలంగాణ కథావర్తనం’ (కథాసాహిత్య విమర్శ), గోపగాని రవీందర్‌ రాసిన ‘శతారం’ (వచన కవిత్వంపై వ్యాసాలు)లను ఎంపిక చేసినట్లు వివరించారు. యువ రచయితల కథా సంపుటాల్లోంచి గజ్జెల రామకృష్ణ రాసిన ‘చంద్రుడు లేని ఆకాశం’(కవిత్వం), 17 ఏండ్లకే పుస్తకాన్ని వెలువరించిన శీర్పి చంద్రశేఖర్‌ రాసిన కవిత్వం ‘కాలుతున్న వెన్నెల’ ఎంపికైనట్లు వివరించారు. వీరికి రూ. 5వేల నగదుతోపాటు మూడు గ్రంథాలను బహూకరించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్‌ 14న వెంకటేశం జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో వారి స్వగృహంలో అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

సింహగర్జనను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

చందుర్తి(వేములవాడ): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో నవంబర్‌ 1న సిరిసిల్లలో నిర్వహించే సిరిసిల్ల సింహగర్జన సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి బట్టు రాంచంద్రం కోరారు. చందుర్తిలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు పసుల రవీందర్‌, నాయకులు మునీందర్‌, మహేందర్‌, చత్రులాల్‌, బాబు, లింగంపల్లి శ్రీనివాస్‌, చరణ్‌, నిషాంత్‌, మనోహర్‌, పోశయ్య పాల్గొన్నారు.



పోరాడి రాజులు అవుతారో.. అమ్ముకొని బానిసలు అవుతారో.. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.
– బీఆర్‌ అంబేద్కర్‌

మీకు తెలుసా?

22 ఏళ్లు.. మూడు గుర్తులు

కరీంనగర్‌: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్‌) పార్టీ పురుడు పోసుకొని సరిగ్గా 22 ఏళ్లయింది. 2001 ఏప్రిల్‌ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించి ప్రస్తుతం బీఆర్‌ఎస్‌గా రూపాంతరం చెందింది. 22 ఏళ్లలో బీఆర్‌ఎస్‌ పార్టీ మూడు గుర్తులతో ఎన్నికల బరిలోకి దిగింది. పార్టీ ఆవిర్భావం జరిగాక సిద్దిపేట ఎమ్మెల్యే పదవి, డిప్యూటీ స్పీకర్‌ పదవికి సీఎం కేసీఆర్‌ రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి బస్సు గుర్తును కేటాయించారు. వెనువెంటనే వచ్చిన స్థానిక సంస్థల (2001)ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి రైతు నాగలి గుర్తును కేటాయించారు. అనంతరం 2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు కారు గుర్తు కేటాయించడంతో ఆ గుర్తు బీఆర్‌ఎస్‌కు సొంతమైంది.

వైభవంగా రథోత్సవం



ముస్తాబాద్‌(సిరిసిల్ల): గోవిందా.. నామస్మరణతో ముస్తాబాద్‌ పుర వీధులు మార్మోగాయి. శ్రీశివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు.

మనోళ్లు సీనియర్లే !

- అసెంబ్లీలో సీనియర్లంతా ఉమ్మడి జిల్లావారే..!
- నాలుగు నుంచి ఏడుసార్లు శాసనసభకు ఎన్నిక
- ఉద్యమాల గడ్డ కావడమే ప్రధాన కారణం

జంగ్‌ తెలంగాణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్‌: స్కూల్‌.. కాలేజీ.. పనిచేసే చోట.. అంతెందుకు కుటుంబంలోనూ చిన్నా, పెద్ద, సీనియర్‌, జూనియర్‌ అన్న వ్యత్యాసాలు సర్వసాధారణం. ఇందుకు అసెంబ్లీ కూడా మినహాయింపు ఏమీ కాదు. ఇప్పుడున్న సభలో ఉమ్మడి రాష్ట్రం నుంచి వరుసగా ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా.. విజయం సాధిస్తున్న ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు. వీరిని సీనియర్‌ శాసనసభ్యులు అంటూ స్పీకర్‌, తోటి ఎమ్మెల్యేలు సంబోధించడం పరిపాటే. అది ఆయా నియోజకవర్గాల్లో ఆ ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాబలం, సభలో వారికి ఉన్న అనుభవానికి తోటి సభ్యులు ఇచ్చే మర్యాద, గౌరవాలకు సూచన. అలాంటి సీనియర్‌ ఎమ్మెల్యేల్లో అధిక శాతం మంది కరీంనగర్‌ జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం సభలో ఉన్న సభ్యులను మిగిలిన జిల్లాల సభ్యులతో పోల్చినపుడు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలే సీనియర్లుగా నిలుస్తున్నారు. వీరిలో మెజారిటీ గులాబీ పార్టీకే చెందిన వారు కావడం విశేషం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో పురుడుపోసుకున్న పార్టీ నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి)కి మొదటి నుంచి కరీంనగర్‌ జిల్లాలో పట్టు ఎక్కువ. అందుకే రాష్ట్ర సాధనలో భాగంగా పలుమార్లు రాజీనామాలు చేయడం.. తిరిగి ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో వీరు తమతోపాటు సభకు ఎంపికైన తోటి ఎమ్మెల్యేల కంటే అత్యధిక సార్లు విజయం సాధించిన నేతలుగా అరుదైన గుర్తింపు సాధించారు. ప్రస్తుతం జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ శాసన సభకు మూడోవి. అదే సమయంలో సభలో కనిష్ఠంగా రెండు నుంచి గరిష్ఠంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినవారు సభలో ఉండటం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో వారు సాధించిన వరుస విజయాలే వారి సీనియారిటీకి కారణం.

7 సార్లు



ఈటల రాజేందర్‌ టీఆర్‌ఎస్‌ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 ఎన్నికల్లో మొత్తం ఏడుసార్లు విజయం సాధించారు. ఇందులో 2008, 2010, 2021 ఉప ఎన్నికలు ఉన్నాయి. 2021లో ఆయన బీజేపీలో చేరి విజయం సాధించడం గమనార్హం.

6 సార్లు



ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983, 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి జరగనున్న శాసన సభ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నారు.

6 సార్లు



మంత్రి కొప్పుల ఈశ్వర్‌ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి మొత్తం ఆరుసార్లు శాసన సభకు ఎన్నికయ్యారు.

4 సార్లు



సిరిసిల్ల నుంచి కేటీఆర్‌, వేములవాడ నుంచి చెన్నమనేని రమేశ్‌బాబు, కోరుట్ల నుంచి కె.విద్యాసాగర్‌రావు 2009, 2010, 2014, 2018లో వరుసగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇందులో 2010లో ఉప ఎన్నిక కావడం విశేషం. ప్రస్తుతం రమేశ్‌బాబు, విద్యాసాగర్‌రావు పోటీలో లేరు.

4 సార్లు



మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 1999, 2004, 2009లో కాంగ్రెస్‌ నుంచి వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్‌ నమోదు చేశారు. 2014లో ఓడినప్పటికీ 2018లో తిరిగి శాసన సభకు నాలుగోసారి ఎన్నికయ్యారు.


3 సార్లు



గంగుల కమలాకర్‌ 2009, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్‌ విజయం సాధించారు. ఈ విజయాలతో కరీంనగర్‌లో తన పేరిట కొత్త రికార్డు లిఖించుకుని, నాలుగోసారి విజయంపై కన్నేశారు.

దివంగత మాజీ ఎమ్మెల్యేల రికార్డు

4 సార్లు




కమలాపూర్‌ ఎమ్మెల్యేగా దివంగత ముద్దసాని దామోదర్‌రెడ్డి 1985, 1989, 1994, 1999లో నాలుగుసార్లు విజయం సాధించారు. దివంగత ఎన్టీఆర్‌ హయాంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

6 సార్లు



దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1957లో చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 1967, 1978, 1985, 1994, 2004లో ఆరుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు.

4 సార్లు



దివంగత దేశిని చిన్నమల్లయ్య 1978, 1984, 1989, 1994లో ఇందుర్తి (ప్రస్తుతం హుస్నాబాద్‌) నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఏర్పాట్లు కట్టుదిట్టం

- ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం
- ప్రతీ పౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవాలి
- అవాంఛనీయ సంఘటనలకు చోటు లేదు
- ఓటరుగా నమోదు చేసుకోండి
- వేములవాడ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి మధుసూదన్‌



వేములవాడ: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టం చేశాం.. ప్రతీ పౌరుడు ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని వేములవాడ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో మధుసూదన్‌ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్‌శాతం పెంపు.. ఎన్నికల నిర్వహణపై ఆదివారం ‘సాక్షి’తో పలు విషయాలు పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

• పోలింగ్‌శాతం పెరిగేలా..

నవంబర్‌ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌ శాతం పెరిగేలా స్వీప్‌ ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఓటరుగా నమోదుకావడం.. ఓటుహక్కు వినియోగించుకోవడంపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నాం. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణపై అధికారులకు ఈ నెల 30, 31, నవంబర్‌ 1న సిరిసిల్లలో శిక్షణ ఇస్తున్నాం. ఎన్నికల ప్రక్రియను మూడు ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌ బృందాలు, ఐదు చెక్‌పోస్టులు, మూడు ఎక్స్‌పెండిచర్‌ బృందాలు, వీడియోసర్వేలైన్‌ బృందం నిత్యం పర్యవేక్షిస్తుంటాయి.

• నామినేషన్లకు ఏర్పాట్లు

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నాం. నవంబర్‌ 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. వేములవాడలోని తహసీల్దారు ఆఫీస్‌లో రిటర్నింగ్‌ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశాం. ఇక్కడే నామినేషన్లు స్వీకరిస్తాం. నవంబర్‌ 13న పరిశీలిస్తాం. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్‌ 15వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తాం. ఈఆర్వో ఆఫీస్‌కు వంద మీటర్ల దూరంలో వాహనాలు ఆపివేసి అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం ఉంది. పోటీ చేసే జనరల్‌ అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. గుర్తింపు పార్టీల అభ్యర్థులకు ఒక్కరు, గుర్తింపు పొందని పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.

• ఓటర్లు 2,19,190

వేములవాడ నియోజకవర్గంలో 2,19,190 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,05,426, మహిళలు 1,13,734, థర్డ్‌ జెండర్‌ 30 మంది ఉన్నారు. 2018 ఎన్నికల్లో 1,92,670 మంది ఓటర్లు ఉండగా.. 80.41 శాతం పోలింగ్‌ నమోదైంది. 18 నుంచి 19 ఏళ్ల మధ్య వారు 2,532 మంది ఉండగా.. అధికారులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో 5,556 మందికి చేరారు.

• 260 పోలింగ్‌ కేంద్రాలు

నియోజకవర్గ పరిధిలో 260 పోలింగ్‌ కేంద్రాలు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో 235 కేంద్రాలు ఉండగా.. పెరిగిన ఓటర్లకు అనుగుణంగా మరికొన్ని కేంద్రాలను పెంచాం. ఒక్కో బూత్‌కు ఐదుగురు సిబ్బందిని నియమిస్తున్నాం. నియోజకవర్గాన్ని 26 సెక్టార్లుగా విభజించాం. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో గెజిటెడ్‌ అధికారిని నియమించాం. వీరు ఒక్కొక్కరు 8 నుంచి 10 పోలింగ్‌ స్టేషన్లను పర్యవేక్షిస్తుంటారు. నియోజకవర్గ పరిధిలో 45 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల్లో వెబ్‌ కాస్టింగ్‌ ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం.

• నవంబర్‌ 28తో ప్రచారం సమాప్తం

ప్రతీ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చు. ఎన్నికల ప్రచార ప్రక్రియ నవంబర్‌ 28 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. ప్రస్తుతం ప్రచారం నిర్వహించుకునేందుకు అనుమతి పొందాల్సి ఉంటుంది.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

- బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ: నియోజకవర్గంలోని బీడీకార్మికులు, టేకేదార్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గంలోని టేకేదార్ల సంఘం సభ్యులతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ బీడీకార్మికులు, టేకేదార్లు ఎదుర్కొంటున్న పీఎఫ్‌, పెన్షన్‌ సమస్యలపై అవగాహన ఉందని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణ, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవిరాజు, టేకేదార్ల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల మైసయ్యతోపాటు సుమారు 500 మంది టేకేదార్లు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలపై అవగాహన

వేములవాడఅర్బన్‌/వేములవాడరూరల్‌: వేములవాడ మున్సిపాలిటీలో విలీన గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణతో కలిసి నాంపల్లి ప్రచారం చేపట్టారు. విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కుల సంఘాల భవనాలు, మహిళ సంఘాల భవనాలు అవసరం ఉందని.. అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. సీనియర్‌ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు జడల లక్ష్మి, నీలం కళ్యాణి పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ పేరిట వసూళ్లపర్వం

- ఆందోళనలో వ్యాపారులు



కరపత్రం

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్‌) అగ్రనేత కామ్రేడ్‌ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ పేరిట జిల్లాలో కొందరు చందాల వసూళ్లకు పాల్పడుతున్నారు. రెండు దశాబ్దాల కిందట సిరిసిల్ల ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి సాయుధ నక్సలైట్లు అటవీ గ్రామాల్లో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి వారోత్సవాలు నిర్వహించేవారు. అటవీ గ్రామాల్లో, జనశక్తి పార్టీకి పట్టున్న గ్రామాల్లో అమరవీరుల తాత్కాలిక స్థూపాలు నిర్మించి వర్ధంతి నిర్వహించేవారు. నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, అరెస్టులతో జనశక్తి ఉద్యమం క్షీణించడంతో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలు, సంస్మరణ వారోత్సవాలు కనుమరుగయ్యాయి. అయితే ప్రస్తుతం సీపీఐ(ఎంఎల్‌) రాజన్నసిరిసిల్ల జిల్లా కమిటీ పేరిట కరపత్రాలు ముద్రించి సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లోని వ్యాపారులను చందాలు అడుగుతున్నారు. కరపత్రాలు ఇస్తూ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని.. చందాలు ఇవ్వండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. స్థానిక వస్త్రవ్యాపారులను రూ.లక్షల్లో అడుగుతూ.. చివరికి రూ.5వేలు, రూ.10వేలు తీసుకెళ్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వబోమని తేల్చిచెబితే సంగతి చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రాంతంలో స్తబ్దుగా ఉన్న చందాల వసూళ్లు మళ్లీ తెరపైకొచ్చాయి.

కరపత్రంలోనూ తప్పులు

చంద్ర పుల్లారెడ్డి సంస్మరణ వారోత్సవాల కరపత్రంలోనూ తప్పులున్నాయి. సిరిసిల్ల గణేశ్‌నగర్‌లో అమరవీరుల సంస్మరణసభ ఉందని కరపత్రంలో పేర్కొన్నారు. అయితే ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో స్పష్టంగా లేకపోవడం చర్చనీయాంశమైంది. కరపత్రంపై ఏ సంవత్సరమో కూడా స్పష్టంగా లేదు. పాత కరపత్రాన్ని చందాల వసూళ్లకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఏఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, కార్మిక నిర్వహణ అధ్యక్షులు, జిల్లా తెలంగాణ సమరయోధుల సంఘం, రైతుకూలి సంఘం, పీడీఎస్‌యూ పేరిట మధు, సాయి పేరిట కరపత్రాలు ఉన్నాయి. ఏది ఏమైన చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సంస్మరణ సభ పేరిట జిల్లాలో వ్యాపారుల వద్ద చందాల వసూళ్లు చర్చనీయాంశమైంది.

బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది



పార్టీలో చేరిన యువకులతో మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్‌: తమ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సిరిసిల్లలోని పలువార్డులకు చెందిన యువకులు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ గెలిస్తే కొందరే బాగుపడతారని.. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే పేదలు బాగుపడతారన్నారు. కాంగ్రెస్‌ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌, నాయకులు యెల్లె లక్ష్మీనారాయణ, మ్యాన ప్రసాద్‌, సూర దేవరాజు, మంగ కిరణ్‌ ఉన్నారు.

బీజేపీలోనే బీసీలకు సముచిత స్థానం

- బీజేపీ సిరిసిల్ల అభ్యర్థి రాణిరుద్రమ



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న రాణిరుద్రమ

సిరిసిల్లటౌన్‌: బీజేపీలోనే బీసీలకు సముచిత స్థానం దక్కుతుందని ఆ పార్టీ సిరిసిల్ల అభ్యర్థి రాణిరుద్రమ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. తెలంగాణలో దొరల పాలనను బద్దలు కొడతామన్నారు. సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడిస్తామన్నారు. సెస్‌ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడి బీఆర్‌ఎస్‌ నేతలు గెలిచారని ఆరోపించారు. షాడో సీఎం కేటీఆర్‌ పాలనను గద్దెదింపే రోజులు వచ్చాయన్నారు. అధికార పార్టీ కుట్రలకు నెరవక బీజేపీలోని ప్రతీ కార్యకర్త శక్తిగా ఇన్నిరోజులు పనిచేశారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే విఠల్‌ సోమన్న, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, ఆడెపు రవీందర్‌, కుమ్మరి శంకర్‌ పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు

- కాంగ్రెస్‌ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌



ఓటర్లతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌

వేములవాడరూరల్‌: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను హామీ చేస్తామని కాంగ్రెస్‌ వేములవాడ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ పేర్కొన్నారు. వేములవాడరూరల్‌ మండలం నూకలమర్రి, చెక్కపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు కాంగ్రెస్‌ ప్రచారంలో మాట్లాడారు. పట్నం నాయకుడు కావాలా? పల్లె నాయకుడు కావాలా? మీరే నిర్ణయించుకోవాలని కోరారు. నాలుగు సార్లు ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉన్నానని.. తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను నమ్మొద్దని కోరారు. ఈ ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టిన ఘనత కాంగ్రెస్‌ ప్రభుత్వానిదేనని, గత పదేళ్లుగా ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం వచ్చిందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్‌, సర్పంచ్‌ సోయినేని కరుణాకర్‌, వంగపల్లి మల్లేశం, రొండి రాజు, సంగ స్వామి, లహరి, సామ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్‌, ప్రభాకర్‌, శ్రీకాంత్‌, శంకర్‌, అడ్డిక శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గంగాధర్‌, మల్లారెడ్డి, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

కోనరావుపేట(వేములవాడ): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆది శ్రీనివాస్‌ కోరారు. కోనరావుపేట మండలంలోని రామన్నపేటకు దుర్గామాత యూత్‌ సభ్యులు 40 మంది కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి మాట్లాడారు. జిల్లా స్థాయి నాయకులు ఉన్నా గ్రామానికి సరైన రవాణా వసతులు లేవన్నారు. కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు షేక్‌ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్‌ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు ఆగేశ్‌, లక్ష్మారెడ్డి, లావణ్య, నవీన్‌, రమేశ్‌, గంగరాజు, రామన్నపేట పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రామన్నపల్లె గ్రామ రైతు జూపల్లి శ్రీనివాస్‌కు చెందిన బర్రె దూడ ఆదివారం ఉదయం మృతిచెంది కనిపించింది. శనివారం రాత్రి తన పొలం వద్ద దూడను కట్టేసి ఇంటికెళ్లాడు. ఉదయం వెళ్లి చూసేసరికి దూడ చనిపోయింది. చిరుత పులి దాడి చేయడంతోనే దూడ మృతిచెందిందని రైతు శ్రీనివాస్ తెలిపాడు. పొలం పరిసరాల్లో చిరుత పులి పాదముద్రలను గుర్తించినట్లు పేర్కొన్నాడు. అధికారులు వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని, చిరుత నుంచి కాపాడాలని కోరాడు. అధికారులు మాత్రం చిరుత దాడి చేసినట్లు నిర్ధారించలేదు.

ఫలిస్తున్న తారక'మంత్రం'

- నేడు బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్:ఎన్నికల వేల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు మంత్రాంగం ఫలిస్తోంది. బీజేపీ నుంచి రోజురోజుకు బీఆర్ఎస్‌లోకి చేరే వారి సంఖ్య పెరిగిపోతోంది. సోమవారం సిరిసిల్ల బీజేపీ నుంచి సుమారు వందమంది మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర, జిల్లా పదవుల్లో ఉన్న వారు కూడా చేరుతున్నట్లు సమాచారం. గతంలో మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా సముచితంగా ఎదుర్కొన్న సిరిసిల్ల నాయకులు కొందరు పార్టీ మారడంపై కమలం పార్టీని కుదిపేస్తుంది. స్థానిక నేతలకు సముచిత న్యాయం దక్కకపోవడం, కొందరు నాయకుల తీరుపై మనస్థాపంతో పలువురు గులాబీ కండువాలు కప్పుకునేందుకు క్యూ కడుతున్నట్లు ప్రచారంలో ఉంది.

రెండు బైకులు ఢీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఎల్లారెడ్డిపేట స్థానిక బస్టాండ్ నుంచి అంబేడ్కర్‌నగర్ వెళ్లే దారిలో ఈ ప్రమాదం జరిగింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారితోపాటు బైపాస్‌రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుకు పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎలుగుబంటి దాడిలో శనివారం గాయపడ్డ గుంటపల్లి చెరువుతండాకు చెందిన గుగులోతు రవిని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆదివారం పరామర్శించారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతును పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజునాయక్, అందే సుభాష్, ప్రభునాయక్, నంది కిషన్, సీత్యానాయక్, దేవిలాల్, శంకర్ నాయక్, హనుమంతు, సురేష్, కాంతారావు పాల్గొన్నారు.

పత్తి రైతుపై తేనెటీగల దాడి



గాయపడ్డ రైతు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన రైతు రొడ్ల కిష్టారెడ్డిపై ఆదివారం తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిష్టారెడ్డికి గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. పత్తిపంటకు నీళ్లు పారించేందుకు ఆదివారం ఉదయం వెళ్లగా అక్కడే ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు ఇంటి వరకు పరుగెత్తుకొచ్చాడు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డ రైతును కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఉద్యమకారులకు హుజూరాబాద్ పట్టం



- 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు
- హుజూరాబాద్‌లోకి కమలాపూర్
- కమలాపూర్‌లో ముద్దసాని.. హుజూరాబాద్‌లో ఈటల మార్క్



నారాయణరెడ్డి



పరిపాటి జనార్దన్‌రెడ్డి



కెప్టెన్ లక్ష్మీ కాంతారావు



కేతిరి సాయిరెడ్డి



ముద్దసాని దామోదర్‌రెడ్డి



ఇనుగాల పెద్దిరెడ్డి



ఈటల రాజేందర్

ఏడాది	గెలుపు	పార్టీ	ఓటమి	పార్టీ
1957	పి.నరసింగరావు	స్వతంత్ర	గాడిపెల్లి రాములు	స్వతంత్ర
1962	గాడిపెల్లి రాములు	కాంగ్రెస్	నాయిని దేవయ్య	సీపీఐ
1967	పి.నరసింగరావు	కాంగ్రెస్	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర
1972	వి.రాజేశ్వర్‌రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	స్వతంత్ర
1978	డి.వెంకట్రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	జనతా
1983	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	స్వతంత్ర
1985	డి.వెంకట్రావు	టీడీపీ	భాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్
1989	కేతిరి సాయిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	టీడీపీ
1994	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	బి.లక్ష్మీకాంతరావు	కాంగ్రెస్
1999	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	కేతిరి సాయిరెడ్డి	కాంగ్రెస్
2004	బి.లక్ష్మీకాంతరావు	టీఆర్ఎస్	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ
2008	వి.లక్ష్మీకాంతరావు	టీఆర్ఎస్	కె.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2009	ఈటల రాజేందర్	టీఆర్ఎస్	వీ.కృష్ణమోహన్‌రావు	కాంగ్రెస్
2010	ఈటల రాజేందర్	టీఆర్ఎస్	ఎం.దామోదర్‌రెడ్డి	టీడీపీ
2014	ఈటల రాజేందర్	టీఆర్ఎస్	కే.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2018	ఈటల రాజేందర్	టీఆర్ఎస్	పాడి కౌశిక్‌రెడ్డి	కాంగ్రెస్
2021	ఈటల రాజేందర్	బీజేపీ	గెల్లు శ్రీనివాస్‌యాదవ్	టీఆర్ఎస్



హుజూరాబాద్: ఉద్యమాలకు కేంద్ర బిందువైన హుజూరాబాద్ 1957లో (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గంగా ఏర్పడి మూడేళ్లకే జనరల్ స్థానంగా మారింది. ఇందులో హుజూరాబాద్, భీమదేవరపల్లి తాలూకాలుగా ఉండేవి. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు ఉప ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగుసార్లు, టీడీపీ, స్వతంత్రులు మూడుసార్లు చొప్పున, ఇక బీఆర్ఎస్ ఏకంగా ఆరు సార్లు విజయం సాధించింది. 2021లో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది. ఇక్కడి నుంచి గెలిచిన ఇనుగాల పెద్దిరెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు మంత్రులుగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్ నియోజకవర్గకేంద్రంతోపాటు ఆ నియోజకవర్గంలో ఉన్న జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట(కొత్తగా ఏర్పడిన మండలం), హుజూరాబాద్ (మొత్తం ఐదు మండలాలు)తో కలిపి ముఖచిత్రంగా మారింది. ఇక కమలాపూర్ నియోజకవర్గం పూర్తిగా కనుమరుగైంది.

ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఇలా

1957లో ఏర్పడిన హుజూరాబాద్‌కు ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఈ నియోజకవర్గంలో ఉన్న సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను హుస్నాబాద్ నియోజకవర్గంలో.. కమలాపూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు జమ్మికుంట, వీణవంక మండలాలను హుజూరాబాద్‌లో కలిపారు. అప్పటివరకు ఉన్న శంకరపట్నం, మానకొండూర్ మండలాలను విడదీసి కొత్తగా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గంలో కలిపారు. హుజూరాబాద్ నుంచి 1957లో ఇద్దరు స్వతంత్రులే బరిలో దిగగా.. పోలుసాని నర్సింగరావును గెలిపించారు. 1962లో గాడిపల్లి రాములు (కాంగ్రెస్), 1967లో తిరిగి పోలుసాని నరసింగరావు (కాంగ్రెస్), 1972లో వొడితెల రాజేశ్వరరావు (కాంగ్రెస్), 1978లో దుగ్గిరాల వెంకట్రావు (కాంగ్రెస్), 1983లో కొత్త రాజిరెడ్డి (స్వతంత్ర), 1985లో దుగ్గిరాల వెంకట్రావు (టీడీపీ), 1989లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కేతిరి సాయిరెడ్డి విజయం సాధించారు. ఇక 1994, 1999లో వరుసగా ఇనుగాల పెద్దిరెడ్డి (టీడీపీ) గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కెప్టెన్ లక్ష్మీకాంతరావును ఆదరించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతారావు టీఆర్ఎస్ నుంచి గెలిచారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి ఈటల రాజేందర్, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈటల ఘన విజయం సాధించారు. 2014, 2018లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ ఈటల రాజేందర్ టీఆర్ఎస్ నుంచే గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్ బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2004వరకు జమ్మికుంటలో నామినేషన్ వేసే ఇక్కడి అభ్యర్థులు.. 2009 నుంచి హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రంలోనే వేస్తున్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

నియోజకవర్గం వ్యవసాయ ఆధారితం. ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే కాకతీయకాలువ ద్వారా ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 59 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జమ్మికుంటలోని పత్తిమార్కెట్ ఉత్తర తెలంగాణలోనే అతి పెద్దదిగా పేరుగాంచింది. సీడ్ ఉత్పత్తిలోనూ హుజూరాబాద్ దేశంలోనే పేరుగాంచింది. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వ్యవసాయంలో సూచనలు చేస్తూ కొత్త వంగడాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. జమ్మికుంట, ఉప్పల్, బిజిగిర్‌షరీఫ్‌లో ఉన్న రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణికులకు రవాణా సులువవుతోంది.

మొత్తం ఓటర్లు 2,44,514

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 106 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు ఉండగా, మొత్తం 305 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 2,44,514 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 1,19,676 మంది పురుషులు, 1,24,833 మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

పోటీ ప్రపంచంలో యువత రాణించాలి

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



యువకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బోయినపల్లి(చొప్పదండి): అవకాశాలను అందిపుచ్చుకుంటూ యువత పోటీప్రపంచంలో రాణించాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. మండలంలోని నర్సింగాపూర్‌లోని యువకులతో ఆదివారం మాటామంతి నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాలేజీ జీవితంలో తాను రాజకీయ రంగంలో ప్రవేశించిన తర్వాత క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చిన తీరును యువకులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నర్సింగాపూర్ సర్పంచు జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు ఉన్నారు.

సాయిలు కుటుంబానికి పరామర్శ

నర్సింగాపూర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన రేగుల సాయిలు కుటుంబాన్ని వినోద్‌కుమార్ పరామర్శించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సాయిలు కుటుంబానికి డబుల బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు.

వడ్ల కమ్మరులను ఆదుకుంటాం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లిలో ఆదివారం వడ్ల కమ్మరి వృత్తిదారులను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. నర్సయ్య మాట్లాడుతూ వడ్ల కమ్మర వృత్తిదారులను ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని బీసీబంధులోనూ అన్యాయం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వృత్తిపరమైన పనిముట్లను ప్రభుత్వం ఉచితంగా అందించేదన్నారు. దేవాచారి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాసరెడ్డి, నాయకులు సూడిద రాజేందర్, రాజునాయక్, ఎండీ ఇమామ్, గుండ్ల శ్రీనివాస్, చెన్ని బాబు, బీపేట రాజు, రాజు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను విస్మరించిన బీఆర్ఎస్

- జీడబ్ల్యూఏసీ కన్వీనర్ దొనికిని కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

సిరిసిల్లఅర్బన్: గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక కన్వీనర్ దొనికిని కృష్ణ అన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీడబ్ల్యూఏసీని ఏర్పాటు చేసి అన్ని దేశాల్లో గల్ఫ్ కార్మికుల సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో కేసీఆర్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఎన్ఆర్ఐ పాలసీని ఏర్పాటు చేసి, చనిపోయిన కార్మికులకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఏజెంట్ల మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. కానీ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి దాదాపు 2వేల మందికి పైగా గల్ఫ్ కార్మికులు మృతిచెందారని, వారి కుటుంబాలు అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో అభివృద్ధి జరిగితే ఇక్కడున్న వారు గల్ఫ్ దేశాలకు ఎందుకు వలస వెళ్తున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల, కామారెడ్డి, వేములవాడ, మానకొండూర్ తదితర నియోజకవర్గాల్లో జీడబ్ల్యూఏసీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గల్ఫ్ కార్మికుల సత్తా ఏందో చూపిస్తామని హెచ్చరించారు. గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సభ్యులు సముద్రాల శ్రీనివాస్, సత్యం, దేవీలాల్, సదాశివ్, దేవయ్య, సతీష్, మధు, ప్రసాద్, సుదర్శన్, లాల, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా



రాజీనామా ప్రకటిస్తున్న కొండ ప్రతాప్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కొండ ప్రతాప్ రాజీనామా చేశారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకివ్వాలని పార్టీని చాలాసార్లు కోరగా.. ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందినట్లు పేర్కొన్నారు. తన పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, ప్రతిని పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌కు అందించనున్నట్లు వివరించారు.

కాంగ్రెస్‌తో ఉపాధి అవకాశాలు

- చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం



మాన్వాడలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. మండలంలోని మాన్వాడకు చెందిన బత్తిని సంపత్, ఐరెడ్డి రాజ్యలక్ష్మి, కంది సూరవ్వ, రాజయ్య, దుర్గయ్య, కిష్టయ్యతోపాటు పలువురు యువకులు దుబాయిలో ఉంటున్న వారాల నర్సింగం ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి మేడిపెల్లి సత్యం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, పార్టీ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, ఎండీ హుస్సేన్, నిమ్మ వినోద్‌రెడ్డి, ఆకుల అజయ్, శాలివాహన శ్రీనివాస్, నక్క శ్రీకాంత్, గోల్కొండ రాకేశ్, సంతోష్, కనకయ్య, కొమురయ్య, వెంకటి ఉన్నారు.

బీఆర్ఎస్‌లో యువకుల చేరిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన విక్టరీయూత్ సభ్యులు ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సమక్షంలో పార్టీలో చేరారు. యూత్ సభ్యులు సంతోష్, వినయ్, సాయి, దేవి, మహేశ్, అక్షయ్, దీపక్, గౌతం గులాబీ కండువాలు కప్పుకున్నారు.

జోరుగా ప్రచారంలో..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆ పార్టీ నాయకులు ఉదయం 6 గంటల నుంచే ప్రచారం మొదలుపెట్టారు. ఆదివారం స్థానిక మార్కండేయ ఆలయంలో పూజలు చేసిన తర్వాత ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్తూ బీఆర్ఎస్ మేనిఫెస్టోని వివరిస్తూ.. మూడోసారి కేసీఆర్ సీఎంను చేయాలని, మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎనగందుల అనసూయ, ఏఎంసీ వైస్‌చైర్మన్ బందారపు బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నంది కిషన్, మీసం రాజం, ఎడ్ల సందీప్, ఎడ్ల లక్ష్మణ్, అప్సర్ ఉన్నీసా, శ్యామ మంజుల, గంట వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



నాయకులతో తోట ఆగయ్య

కేటీఆర్ లక్ష మెజారిటీతో విజయం సాధించాలి

- రాజన్నపేట నుంచి వేములవాడకు పాదయాత్ర
- మొక్కులు చెల్లించుకున్న బీఆర్ఎస్ నాయకులు



వేములవాడకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల ఎమ్మెల్యేగా లక్ష మెజార్టీతో కేటీఆర్ గెలువాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు రాజన్నపేట నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు. మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేట గ్రామం స్థానిక శివాలయం నుంచి ఆదివారం మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాదయాత్రను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు బాగున్నాయన్నారు. గతంలో కంటే ఈసారి లక్ష మెజార్టీతో గెలిపించుకుంటామని శపథం చేశారు. ఈ పాదయాత్రలో మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్, ఉమేశ్, నర్సింలు, శంకర్, వెంకటరమణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువతకు చేసిందేమీ లేదు

- కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్‌రావు



మాట్లాడుతున్న చీటీ ఉమేష్‌రావు

సిరిసిల్లఅర్బన్: పదేళ్లలో యువతకు బీర్ఎస్ పార్టీ చేసేందేమి లేదని, ఇప్పుడు యువ సమ్మేళనం పేరుతో మరోసారి యువతను మభ్యపెట్టాలని చూస్తోందని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్‌రావు అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల నుంచి బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేస్తోందని, నోటఫికేషన్లివ్వక, పరీక్షలు సజావుగా జరగక చాలామంది నష్టపోతున్నాన్నారు. కిరాయి రైతులను తీసుకొచ్చి దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, చుక్క శేఖర్, ఎడమల భూపాల్‌రెడ్డి, ఆసరి బాలరాజ్, మొగిలి సంపత్, మల్లేష్‌బాబు, అజయ్, సురేందర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కేటీఆర్‌తో నాయకులు

ముస్తాబాద్: హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ, నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ తన్నీరు గౌతంరావు ఆధ్వర్యంలో బీజేపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి, ఆది శేఖర్, రాజేశ్, కిట్టు, కోల సతీష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా.. కేటీఆర్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ శరత్‌రావు, పోతుగల్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, సీనియర్ నాయకులు పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్‌రావు, నాని, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెరచుకున్న రాజన్న గుడి





వేములవాడ: చంద్రగ్రహణం ముగియడంతో ఆదివారం వేకువజామున సంప్రోక్షణ చేసిన తర్వాత రాజన్న ఆలయాన్ని తెరిచారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కరీంనగర్ సీపీగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన సుబ్బారాయుడు కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

వెంకన్నకు గరుడ సేవ



గంభీరావుపేట(సిరిసిల్ల): లింగన్నపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడ సేవ నిర్వహించారు.